క్లుప్తంగా

ఎట్టకేలకు ధాన్యం తరలింపు

సాక్షి ఎఫెక్ట్..

కేసముద్రం: మండలంలోని కల్వల, తాళ్లపూసపల్లి గ్రామాల్లో గల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తయిన ధాన్యం బస్తాలను ఎట్టకేలకు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని లారీలను ఏర్పాటు చేసి, మిల్లులకు తరలించారు. ఇనుగుర్తి 1, 2వ సెంటర్‌లలో ధాన్యం బస్తాలను తరలించేందుకు గురువారం లారీలను ఏర్పాటు చేశారు. ఈనెల 28న 'సాక్షి' దినపత్రికలో 'కాంటాలు పూర్తయినా.. కదలని ధాన్యం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన జిల్లా స్థాయి అధికారులు లారీల ఏర్పాటు చేయించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. త్వజుగతిన కాంటాలైన బస్తాలను మిల్లులకు తరలిస్తామని సీఈఓ ఎల్లయ్య ఆదేశించారు.

వేం నరేందర్‌రెడ్డికి ఆహ్వానపత్రం అందజేత



ఆహ్వాన పత్రం అందజేస్తున్న నాయకులు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో జూన్ 3న చేపట్టనున్న అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణకు హాజరుకావాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి, అంబేడ్కర్ యువజన సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కేసముద్రం పీఏసీఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న, సంఘం అధ్యక్షుడు పప్పుల వెంకన్న, సలీం, బేతమళ్ల చంద్రయ్య పాల్గొన్నారు.

యూకేలో బీఆర్ఎస్ యూత్ కోఆర్డినేటర్‌గా అబ్దుల్ కుదుస్



అబ్దుల్ కుదుస్‌ను అభినందిస్తున్న కేటీఆర్

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి నాయకుడు అబ్దుల్ కుదుస్‌ను యునైటెడ్ కింగ్‌డమ్ తెలంగాణ అసోసియేషన్ యువజన సమన్వయకర్తగా నియమించారు. ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అబ్దుల్ కుదుస్‌ను అభినందించాడు.

సీఎస్‌ను కలిసిన మాజీ ఎంపీటీసీ

కేసముద్రం: హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును, మండలంలోని నారాయణపురం గ్రామ మాజీ ఎంపీటీసీ దారావత్ రవి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశాడు.

ధాన్యం తరలింపునకు చర్యలు

తొర్రూరు రూరల్: కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని తరలించేందుకు వాహనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. గురువారం వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని పాల కేంద్రం వద్ద తిష్టవేసి వచ్చిపోతున్న లారీలు, డీసీఎంలను నిలిపివేసి కొనుగోలు కేంద్రాలకు పంపిస్తున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ బషీర్, వీఆర్ఏలు యశ్వంత్, శ్రీనివాస్‌రావు, ప్రశాంత్, సుధాకర్, రమేశ్, వరుణ్ పాల్గొన్నారు..

వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 17, 18 వార్డుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ డిమాండ్ చేశాడు. సీపీఐ ఆధ్వర్యంలో గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో డీఈ సీహెచ్ ఉపేందర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఇల్లెందు రోడ్డులో ఉన్న హిందూ, ఆర్యవైశ్య శ్మశానవాటికలో విద్యుత్ స్తంభాలు లేక దహన సంస్కార కార్యక్రమాలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

గార్ల: గిరిజన ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్రప్రభుత్వం ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం ప్రవేశ పెట్టినట్లు బంజారా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తేజావత్ జోగ్రాంనాయక్ వెల్లడించారు. గురువారం గార్లలో ఆయన మాట్లాడారు. కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ శాఖ దేశంలో 556 ఏజెన్సీ గ్రామాలను గుర్తించిందని, ఇట్టి గ్రామాల్లో గిరిజనుల అభ్యున్నతి కోసం గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఈ కొత్త పథకం ప్రవేశ పెట్టిందన్నారు.

ప్రారంభానికి నోచుకునేనా?

- గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల భవనాలు నిర్మించి రెండేళ్లు
- పాత భవనంలో బాలికల విద్యాభ్యాసం
- పట్టింపు లేని అధికారులు

కురవి: మండల కేంద్రంలో గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు నూతన భవనాలను నిర్మించి రెండేళ్లు కావస్తున్నప్పటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. కురవిలోని జెడ్పీ హైస్కూల్ పక్కన పాత భవనంలోనే గత ఏడాది విద్యా సంవత్సరం పూర్తయింది. అరకొర వసతుల నడుమ పాత భవనంలో విద్యాభ్యాసం జరిగింది. కొత్త భవనంలోకి వెళ్లి అక్కడే చదువుకుందామనుకున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరమైనా ప్రారంభానికి నోచుకునే అవకాశం ఉందా? అని విద్యార్థినులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. గిరిజన శాఖ నిధులతో చేపట్టిన నూతన భవనాలు, ప్రహరీ పూర్తయి



ప్రారంభానికి నోచుకోని ఆశ్రమ పాఠశాల నూతన భవనం

రెండేళ్లు కావస్తున్నా ఆ శాఖ అధికారులు ప్రారంభించేందుకు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొత్త భవనంలోకి మార్చాలని పలుమార్లు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, ఆందోళనలు గత ఏడాది జరిగాయి. అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నపాలు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోవడంలేదు. ఇరుకు గదుల్లో చదువులు, వసతి ఉండడం ఇబ్బందిగా మారిన పాత భవనాల నుంచి కొత్త భవనాల్లోకి ఈ విద్యాసంవత్సరమైనా ప్రారంభించాలని విద్యార్థులు, సంఘాల నాయకులు కోరుతున్నారు.

ప్రారంభించకుంటే ఆందోళనే..



కురవిలో గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ఈ ఏడాది ప్రారంభించకుంటే ఆందోళన చేస్తాం. కొన్నేళ్ల నుంచి పాత భవనాల్లో బాలికలు అవస్థలు పడుతూ చదువుకోవాల్సి వచ్చింది. వెంటనే పాఠశాలను ప్రారంభించాలి.

– గుగులోత్ సూర్యనాయక్, డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

గంగారం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు ముగ్గు పోసుకుని త్వరితగతిన ఇళ్లను నిర్మాణం చేపట్టి, బిల్లులు పొందాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలోని కొడిశలమిట్ట, పందెం గ్రామాల్లో 74 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఇళ్లకు ముగ్గులు పోసి శంకుస్థాపన చేపట్టారు. అనంతరం కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. మండలంలోని మొత్తం 317 ఇళ్లను మంజూరు చేశామని, రాని వారికి దసరా వరకు రెండో దఫాలో మరిన్ని ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. మహిళలకు



ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోసి ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తుందని, సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని మరిపెడ, గోవిందపురంలో ఉన్న గిరిజన మినీ గురుకులంలో ఒకటి నుంచి 7వ తరగతి వరకు మిగిలి ఉన్న బ్యాక్ లాగ్ సీట్లకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన శాఖ రీజినల్ కోఆర్డినేటర్ పి. రత్నకుమారి గురువారం తెలిపారు. గురుకులం ఉన్న మండలానికి చెందిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, మిగతా వారికి రెండో ప్రాధాన్యత కల్పిస్తామని, మినీ గురుకులంలో నేరుగా దరఖాస్తుల ఫారంలు నేటి నుంచి జూన్ 6వ తేదీలోగా అందజేయాలన్నారు. లక్కీ డ్రాతో జూన్ 9వ తేదీన విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. పూర్తి వివరాలకు మరిపెడ హెచ్ఎం మైథిలి 93811 53893, గోవిందపురం హెచ్ఎం కల్యాణి 63025 60790 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



మహబూబాబాద్ అర్బన్: ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని, ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్యను తీర్చిదిద్దుతామని నోటి మాటలు తప్ప ఆచరణ ఉండడం లేదని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేశ్ అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవం గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయం టీపీటీఎఫ్ జెండాను సీనియర్ నాయకుడు అంజయ్య ఎగురవేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ చుంచు శ్రీశైలం, ఐలబోయిన సువర్ణ, కమిటీ సభ్యులు శ్రీనివాస్, ఉపేందర్, జనార్దన్, సబియా భాను, భిక్షపతి, లింగారెడ్డి, విజయకుమార్, శివకుమార్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

పెద్దవంగర: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో మండల శాఖ ఆధ్వర్యంలో టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కార్యదర్శి వల్లాల శ్రీనివాస్, సభ్యులు దేవేందర్, లక్ష్మణ్, మురళి, యుగేందర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

గార్ల: టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలను గార్లలో సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకుడు వెంకటేశ్వర్లు, బాలాజీనాయక్, సామా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో గురువారం టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఆదినారాయణ, ఎంఈఓ రవికుమార్, గండి ఉదయ్‌కిరణ్‌కుమార్, మమ్మద్



పెద్దవంగరలో..

అలీ, సోమ రవి, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు డివిజన్ కేంద్రంలోని సంఘ కార్యాలయం ఎదుట నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మాజీ రాష్ట్ర నాయకుడు వినోద్‌రెడ్డి, కొలుపుల శ్రీనివాస్, తండా ప్రభాకర్, వీరన్న, సంపత్ పాల్గొన్నారు.

కురవి: ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్ డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, విద్యాసాగర్, శివకుమార్, బాబురావు, వెంకటేశ్వర్లు, విజయ్‌రాజ్, సింగం మనోహర్, రహీముద్దీన్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాకయ్య, జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్ వెంకటేశ్వర్లు, ప్రవీణ్, నవీన్, రాజు పాల్గొన్నారు.

నిరంతరం ప్రజల మధ్య ఉండాలి



మాట్లాడుతున్న వీరయ్య

మరిపెడ: వర్గపోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఆసన్నమైందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య అన్నారు. మరిపెడలో జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. కమ్యూనిస్టు కార్యకర్తలు నిరంతరం ప్రజల మధ్య ఉండాలని వారి కోసమే జీవించాలని చెప్పారు. పాలకవర్గాలు ప్రజావ్యతిరేక విధానాలను, వారు చేస్తున్న తప్పిదాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ నిలదీస్తూ వర్గ పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శ సాదుల శ్రీనివాస్, సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, అకుల రాజు, కుంట ఉపేందర్, కందనూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి మధుసూదన్, లచ్చయ్య, రాజశేఖర్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

శాశ్వత మున్సిపల్ కమిషనర్‌ను నియమించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయానికి రెగ్యులర్ మున్సిపల్ కమిషనర్ లేకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళీ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కమిషనర్ ఇన్‌చార్జ్ పాలనతో జిల్లా కేంద్రంలోని ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. రాజీవ్ యువ వికాస్, ధ్రువీకరణ పత్రాలు ఆలస్యం అవుతున్నాయన్నారు. శాశ్వత మున్సిపల్ కమిషనర్‌ను నియమించాలని డిమాండ్ చేశాడు. ఈ సమావేశంలో నాయకులు శ్యామ్ సుందర్ శర్మ, సందీప్ పాల్గొన్నారు.

రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని డీవీ నాయక్ అకాడమీ నిర్లక్ష్యం కారణంగా మరణించిన కార్తీక్ కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంధసిరి జ్యోతి బస్సు, పట్ల మధు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్తీక్ మృతదేహం ఉన్న మార్చురీ ముందు ధర్నా నిర్వహించారు. అకాడమీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సింహాద్రి, జిల్లా సహాయ కార్యదర్శి నిక్షిప్త,



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పట్టణ కార్యదర్శి గుండ్ల రాకేశ్, నాయకులు మురళీ, శరత్, మహేష్, వినోద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

చిన్నగూడూరు: వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఉగ్గంపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉగ్గంపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ మండల టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. జీపీ, వైద్య సిబ్బంది గ్రామాల్లో డ్రై డే-ఫ్రై డే కార్యక్రమాలను నిర్వహిస్తూ బ్లీచింగ్ పౌడర్, టెమోఫోస్, పెరిత్రిమ్, ఆయిల్ బాల్స్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎంపీడీఓ



మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

రామారావు, ఎంపీఓ రజని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, జీపీ కార్యదర్శులు, సీహెచ్ఓ వలిఉద్దీన్, హెచ్‌వీ రాధాకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ సుమలత, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కొత్తగూడ: కురుస్తున్న వర్షాలతో ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజు సూచించారు. మండలకేంద్రంలోని రైతువేదికలో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, ఏఓ ఉదయ్, ఎస్సై కుశకుమార్, కార్యదర్శులు, ఏఈఓలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు



నర్సింహులపేట: నర్సింహులపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 1నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలను అందచేయడానికి ఎమ్మార్సీకి చేరుకున్నాయి. పుస్తకాలను జూన్ 6వ తేదీలోగా పాఠశాలలకు అందజేయడానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చినట్లు తెలిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ రామ్మోహన్‌రావు హెచ్చరించారు.

బూటకపు ఎన్‌కౌంటర్లతో ఉద్యమాన్ని ఆపలేరు

గార్ల: బూటకపు ఎన్‌కౌంటర్లతో ఉద్యమాన్ని ఆపలేరని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు జి.సక్రు అన్నారు. మండలం లోని అంజనాపురం గ్రామ సమీపంలో కాచనపల్లి అమరవీరుల వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత అమరవీరుల స్థూపం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుధాకర్, మంగీలాల్, నాగ, ప్రశాంత్, సాయి, శాంతి పాల్గొన్నారు.

31న టీజేఎఫ్ రజతోత్సవ సభ

చిన్నగూడూరు: ఈనెల 31న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డు జలవిహార్ ఆడిటోరియంలో జరిగే టీజేఎఫ్ 25 వసంతాల రజతోత్సవ సభను విజయవంతం చేయాలని జిల్లా కోకన్వీనర్ గాడిపెల్లి శేఖర్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహబూబ్ అలీ, సంఘం నాయకులతో కలిసి రజతోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కరుణాకర్, శ్రీనివాస్, కాశయ్య, శ్రీపాల్, విజయ్ పాల్గొన్నారు.

అధికారులపై చర్య తీసుకోవాలి

కొత్తగూడ: ముస్మి గ్రామంలో పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతును నిర్బంధించి కొట్టిన అధికారులపై చర్య తీసుకోవాలని అటవీ శాఖ రేంజర్‌కు తుడుందెబ్బ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ఆగబోయిన రవి, వెంకటరత్నం, కుంజ నర్సింగరావు పాల్గొన్నారు.

సన్మాన సభను విజయవంతం చేయాలి

గూడూరు: మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు అందించడం హర్షించదగ్గ విషయమని సంఘం జిల్లా కార్యదర్శి రుద్ర తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. మంద కృష్ణమాదిగకు ఈనెల 31న సన్మాన కార్యక్రమం ఉంటుందని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీరాములు, లక్ష్మణ్, ఉమేష్, సంపత్, ముక్తీశ్వర్ పాల్గొన్నారు.

జీలుగ విత్తన ధరలు తగ్గించాలి

గూడూరు: ప్రభుత్వ సబ్సిడీపై విక్రయిస్తున్న జీలుగ విత్తన బస్తా ధర తగ్గించాలని ఎంసీపీఐ (యూ) జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్‌యాదవ్ డిమాండ్ చేశాడు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం జీలుగ విత్తన బస్తా ధర రూ.1150 ఉంటే, ఈ సంవత్సరం రూ.2137కు పెంచిందన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఏఓ అబ్దుల్‌మాలిక్‌కు అందజేశారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

తొర్రూరు: ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్, ప్రగతి సేవా సమితీల ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని క్లబ్ భవన్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. హైదరాబాద్ నానక్‌రాంగూడకు చెందిన శంకర్ ఐ హాస్పిటల్ సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, గద్దల జాన్, వెంకట్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా కాంగ్రెస్

పెద్దవంగర: బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు తోటకూరి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని అవుతాపురం గ్రామంలో బొమ్మెరబోయిన ఎల్లమ్మ (57) గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసున్న శ్రీనివాస్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కురవి: అనుమానాస్పద స్థితిలో మండల కేంద్రానికి చెందిన దుస్సరాంబాబు(40) ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలలో గురువారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం రాంబాబు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. నంద్యాలలోని రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో శరీరంపై గాయాలతో ఉండడాన్ని అక్కడి పోలీసులు గుర్తించారు. చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ రాంబాబు మృతిచెందాడు. బంధువులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మరిపెడ: టాటాఏస్ వాహనం లారీ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని నేతావత్‌తండా సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మరిపెడకు చెందిన బట్టల వ్యాపారి వంగవీటి రామకృష్ణ వరంగల్‌లో దుస్తులు కొనుగోలు చేసి తిరిగి వస్తున్న క్రమంలో నేతావత్ తండా వద్దకు రాగానే ఖమ్మం నుంచి తొర్రూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

పాలాభిషేకం



మహబూబాబాద్ రూరల్/తొర్రూరు: ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసిన సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, యశస్వినిరెడ్డిల చిత్రపటాలకు గురువారం పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, సురేష్, సంతోష్ సాయితేజ, దిలీప్, నరేష్, మురళీ, సోమ రాజశేఖర్, అచ్చిరెడ్డి, సధాకర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు ఇవ్వాలి

బయ్యారం: రాజీవ్ యువ వికాసం రుణాలు రాజకీయంతో సంబంధం లేకుండా అర్హులైన వారందరికీ రుణాలు ఇవ్వాలని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు తుడుం వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. గురువారం బయ్యారంలో ఆయన మాట్లాడారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మహబూబాబాద్ రూరల్: ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న సీఐ, తహసీల్దార్, ఏఓ

మహబూబాబాద్ రూరల్: రైతులకు డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఏఓ తిరుపతిరెడ్డి అన్నారు. తెలిపారు. పట్టణంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో తహసీల్దార్ రాజేశ్వరరావు, టౌన్ సీఐ దేవేందర్, ఏఓ తిరుపతిరెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తన, పురుగు మందుల, ఎరువుల డీలర్ల లైసెన్సులు, రిజిస్టర్లు, వచ్చిన విత్తన స్టాక్ వివరాలు తనిఖీ చేశారు. నిబంధనలు అతిక్రమించి రైతులను మోసం చేయాలని చూస్తె కేసులు బుక్ చేస్తామని హెచ్చరించారు.

కురవి: సీరోలు మండలంలోని పలు ఎరువుల, విత్తనాల దుకాణాలను తహసీల్దార్ పున్నంచందర్, మండల వ్యవసాయాధికారి చాయారాజ్, ఎస్సై నగేష్‌లు సంయుక్తంగా గురువారం తనిఖీ చేశారు.

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని ఎరువుల, విత్తన దుకాణాలను ఎస్సై మురళీధర్‌రాజు, ఏఓ మహేందర్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధిక ధరలకు ఎరువులను అమ్మినా డీలర్లపై చట్టప్రకారంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దవంగర: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ మహేందర్, ఏఓ స్వామినాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మన గ్రోమోర్ విత్తన దుకాణంను ఎస్సై క్రాంతి కిరణ్‌తో కలిసి తనిఖీలు చేపట్టారు.

తొర్రూరు: నకిలీ విత్తనాలు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ రాంనర్సయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో వ్యవసాయ శాఖ, పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎస్సై ఉపేందర్, ఏఈఓలు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలోని విత్తనాల షాపులను మండల వ్యవసాయ అధికారి వాహిని, ఎస్సై రాజు గురువారం తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చిన్నగూడూరు: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే విత్తన డీలర్లపై చర్యలు తప్పవని తహసీల్దార్ మహబూబ్ అలీ, మండల వ్యవసాయాధికారి భాస్కర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఉగ్గంపల్లి రైతువేదికలో విత్తన డీలర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై వెంకటయ్య, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

బయ్యారం: మండలంలోని కొత్తపేట, గంధంపల్లి గ్రామాల్లో గురువారం మండల అధికారులు విత్తన దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ నాగరాజు, ఏఓ రాంజీ, ఎస్ఐ తిరుపతి, ట్రెయినీ ఎస్సై మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల వస్తువుల అపహరణ

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ వస్తువులు అపహరణకు గురైన ఘటనలో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై దీపిక గురువారం తెలిపారు. కొమ్ముగూడెం గ్రామంలో గల ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నర్సరీ చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, పల్లెప్రకృతి వనం చుట్టూ ఏర్పాటు చేసిన స్తంభాలు, ఫెన్సింగ్, నర్సరీలో మొక్కలకు వినియోగించేందుకు ఏర్పాటు చేసిన బోర్, దానికి అమర్చిన విద్యుత్ వైర్ గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లారు. ఈ వస్తువుల చోరీ ఘటనపై పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్సై పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మహబూబాబాద్ రూరల్: ప్రజాసంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ భూక్య వెంకటేష్ అన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ కార్యవర్గ సమావేశం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా యువజన కాంగ్రెస్ నాయకులు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, సాయితేజ, సందీప్, విజయ్, వెంకటేశ్వర్లు, గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూక్య వెంకటేష్

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

డోర్నకల్: సీరోలు మండలం చిలుకొయ్యలపాడుకు చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గడ్డం ఉమ గురువారం తెలిపిన వివరాల ప్రకారం చిలుకొయ్యలపాడుకు చెందిన ఊడ్గుల ఉపేందర్(25) హైదరాబాద్‌లో ఎంబీఏ పూర్తి చేసి ఇటీవల గ్రామానికి వచ్చాడు. బుధవారం రాత్రి భోజనం చేసి డాబాపై పడుకుంటానని కుటుంబ సభ్యులకు చెప్పి డాబాపైకి వెళ్లాడు. గురువారం ఉదయం బాబాయి ఊడ్గుల వీరన్న తమ వ్యవసాయ భూమి వద్దకు వెళ్లగా అక్కడ ఉపేందర్ చింతచెట్టుకు ఉరేసుకుని చనిపోయి కనిపించాడు. మృతుడి తండ్రి వీరభద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.